
సాక్షి
రంగారెడ్డి
బుధవారం, 3, జనవరి, 2024



ఆదమరిస్తే అంతే.!

పొగ మంచు జిల్లాపై చలి పంజా విసురుతోంది. చలి, పొగమంచు కారణంగా ప్రజలు వణికిపోతున్నారు. 8లో▸



వంతెన నిర్మించండి

చింతల్‌చెరువు కాల్వపై శాశ్వత వంతెన నిర్మించాలని మత్స్యకార్మిక సంఘం నాయకులు కోరారు. 8లో▸



ముందస్తుతో లాభాలు

ఫ్రెంచి చిక్కుడు(బీన్స్) సాగుతో రైతులు లాభాలు గడిస్తున్నారు. పంట సాగుపై శ్రీకృష్ణ సలహాలు అందించారు. 8లో▸

న్యూస్‌రీల్

పెట్రోల్, డీజిల్ కొరత లేదు

పౌర సరఫరాల శాఖ అధికారి రఘునందన్

తుక్కుగూడ: పెట్రోల్, డీజిల్ కొరత ఎక్కడ లేదని, ఇంధన ట్యాంకర్‌ల రవాణా మూలంగా సమస్య తలెత్తిందని జిల్లా పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్ అన్నారు. మంగళవారం ఆయన తుక్కుగూడ, మహేశ్వరంలోని పలు పెట్రోల్ బంక్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ..అత్యవసర సేవల పరిధిలోకి వచ్చే ఇంధన సౌలభ్యత విషయంలో రాజీ ప్రసక్తే లేదని.. ఇంధన నిల్వ కోసం శాయశక్తులా కృషి చేస్తామన్నారు.

హెల్ప్ డెస్క్‌లను వినియోగించుకోవాలి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్

గచ్చిబౌలి: ప్రజా పాలన కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు హెల్ప్‌డెస్క్‌లు పని చేసేలా చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కొండాపూర్ డివిజన్‌లోని అంజయ్యనగర్, ప్రేమ్‌నగర్ దరఖాస్తు కేంద్రాలను ఆయన పరిశీలించారు. దరఖాస్తు దారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, జిరాక్స్ సెంటర్లకు వెళ్లవద్దని సూచించారు. కేంద్రాలలో పని చేస్తున్న సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఆయన వెంట శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డీసీ రజనీకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మహిళా కానిస్టేబుల్ బ్యాగు చోరీ

బంజారాహిల్స్: సాధారణ ప్రజల సొమ్ము చోరీ చేస్తే కిక్కు ఏముంటుందని అనుకున్నాడో ఏమో ఒక దొంగ...ఏకంగా ఒక మహిళా కానిస్టేబుల్ బ్యాగును చోరీ చేశాడు. బంజారాహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఏఆర్ మహిళా కానిస్టేబుల్ గుర్రాల ప్రసన్న డిసెంబర్ 31న రాత్రి బందోబస్తులో భాగంగా బంజారాహిల్స్‌లోని పార్క్ హయాత్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ చెకింగ్‌కు వచ్చారు. తన బైక్‌ను పక్కన పార్క్‌చేసి తనిఖీలు నిర్వహించింది. రాత్రి 2 గంటల ప్రాంతంలో నీరు తాగేందుకు తన బైక్‌కు పెట్టిన బ్యాగులోని వాటర్ బాటిల్ కోసం వెళ్లి చూడగా బ్యాగు కనిపించలేదు. దీంతో ఆమె ఫిర్యాదు చేయగా...బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మళ్లీ.. ఫార్మా లొల్లి!



ఫార్మాసిటీ రద్దు ప్రకటనతో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు (ఫైల్)

- ముఖ్యమంత్రి తాజా ప్రకటనతో అన్నదాతల ఆందోళన
- పక్షంలో రోజుల్లోనే మాటమార్చడంతో రైతుల్లో గుబులు
- రూ.20వేల కోట్లకుపైగా ఖర్చు.. 12వేల ఎకరాలపైగా భూసేకరణ

యాచారం: ఫార్మాసిటీపై రైతుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని ఆ పార్టీ తన మేనిఫెస్టోలో పొందుపరిచింది. అనుకున్న విధంగానే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన కొద్ది రోజుల్లోనే ఫార్మాసిటీని తరలిస్తామని ప్రకటించారు. స్వయంగా ముఖ్యమంత్రి ఫార్మాసిటీని తరలిస్తామని చెప్పడంతోరైతులు ర్యాలీలు నిర్వహించి, సంబురాలు నిర్వహించి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తాజాగా సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. ఫార్మాసిటీని రద్దు చేయడం లేదు, ఒకే చోట ఫార్మాసిటీ ఏర్పాటు చేయకుండా ఓఆర్‌ఆర్, ఆర్‌ఆర్‌ఆర్ మధ్య పది ప్రాంతాల్లో ఫార్మా విలేజీలు ఏర్పాటు చేస్తామని వెల్లడించ డంతో రైతుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. పక్షం రోజుల్లోనే సీఎం మాటమార్చడం పట్ల రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతుంది. కాంగ్రెస్ ఫార్మాసిటీ రద్దు అంశంపై ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేయడంతో ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు మల్‌రెడ్డి రంగారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్యేలుగా గెలిచారు. తాజా పరిణామాలతో స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధులతో పాటు, పార్టీ శ్రేణుల్లో గందరగోళంఏర్పడింది. ఓటేస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని మాటిస్తిమి.. ముఖ్యమంత్రి ఫార్మాసిటీ రద్దు చేయడం లేదనే ప్రకటనతో ప్రజలకేమి చెప్పాలని ఆందోళన చెందుతున్నారు.

12 వేల ఎకరాలకు పైగా భూసేకరణ

కేసీఆర్ సర్కార్ మహానగరానికి దగ్గరగా ఉన్న రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజవర్గాల సరిహద్దులో 19,333 ఎకరాల్లో ఫార్మాసిటీ ఏర్పాటుకు సంకల్పించిన విషయం విదితమే. మూడు నియోజకవర్గాల పరిధిలోని దాదాపు పది గ్రామాల్లో ఇప్పటికే 12 వేల ఎకరాలకు పైగా అసైన్డ్, పట్టా భూమిని సేకరించింది. మొదట్లో అసైన్డ్ భూమి ఎకరాకు రూ.8 లక్షలు, కబ్జాలో ఉన్న రైతులకు ఎకరాకు రూ.7.70లక్షలు, పట్టా భూమి ఎకరాకు రూ.12.50లక్షల చొప్పున పరిహారాన్ని చెల్లించింది. ఆ తర్వాత పట్టా భూములకు ఎకరాకు రూ.16లక్షల ధర పెంచి పరిహారాన్ని పంపిణీ చేశారు. దాదాపు రూ. 20వేల కోట్ల వరకు ఖర్చు చేసి రైతులకు పరిహారంతో పాటుగా భూ అభివృద్ధి పనులు చేపట్టింది. భద్రత దృష్ట్యా ముందు జాగ్రత్తగా నక్కర్తమేడిపల్లి గ్రామంలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సైతం ప్రారంభించింది. ఫార్మాసిటీతో ఆయా నియోజకవర్గాల్లో రియల్ వ్యాపారులు రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టి భూములు కొనుగోలు చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిమ్జ్ (నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మానిఫ్యాక్చరింగ్ జోన్)హోదా సాధించింది. మూడోసారి కేసీఆర్ సర్కార్ వస్తే ఫార్మాసిటీకి శంకుస్థాపన చేస్తామనే బీఆర్‌ఎస్ శ్రేణులు భావించారు.

మూడేళ్లుగా 'రైతుబంధు, బీమా'కు దూరం

ఫార్మాసిటీకి అసైన్డ్ భూముల సేకరణలో ఇబ్బంది లేనప్పటికీ.. పట్టా భూముల సేకరణతో రైతుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. యాచారం మండల పరిధిలోని కుర్మిద్ద, నానక్‌నగర్, తాడిపర్తి, నక్కర్తమేడిపల్లి గ్రామాల్లోని దాదాపు 400 మందికి పైగా రైతులు 3,800 ఎకరాల పట్టా భూమిని ఫార్మాసిటీకి ఇవ్వడానికి అంగీకరించలేదు. ఏడాదికి మూడు పంటలు పండే భూమిని ఫార్మాకిచ్చి మేము ఎలా బతకాలని రైతులు అధికారులపై తిరగబడ్డారు. దీంతో రెవెన్యూ, టీఎస్‌ఐఐసీ అధికారులు రైతులకు సమాచారం లేకుండానే పట్టా భూముల రికార్డులను ధరణి పోర్టల్‌లో టీఎస్‌ఐఐసీ పేరు మీద మార్చేశారు. మా పట్టా భూముల రికార్డులను టీఎస్‌ఐఐసీ పేరు మీద నుంచి తీసేసి మా మీద మార్చాలని రైతులు ఆందోళన చేపట్టారు. పాదయాత్రలు, సీసీఎల్‌ఏ, కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టారు. అధికారులు మాత్రం టీఎస్‌ఐఐసీ పేరు మీద మార్చేసిన పట్టా భూముల రికార్డులను ధరణి పోర్టల్‌లో రైతుల పేర్ల మీద మార్చలేదు. మూడేళ్లుగా రైతులకు రైతుబంధు, రైతుబీమా, బ్యాంకు రుణాలు రావడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో విక్రయిద్దామన్న, మ్యూటేషన్ చేద్దామన్న వీలవ్వడం లేదు. తాజాగా ఫార్మాసిటీని రద్దు చేయడం లేదని సీఎం చెప్పడం పట్ల రైతుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది.

కలెక్టర్‌తో సమావేశమవుతాం



ఫార్మాసిటీపై రైతులు ఆందోళన చెందవద్దు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో స్వయంగా మాట్లాడాను. మహానగరానికి దగ్గరలో ఫార్మాసిటీ లాంటి కాలుష్య పరిశ్రమలు ఉండరాదని సీఎం నాతో స్వయంగా చెప్పారు. త్వరలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి కలెక్టర్‌తో సమావేశమవుతాం. టీఎస్‌ఐఐసీ పేరు మీద నమోదు చేసిన పట్టా భూములను ధరణి పోర్టల్‌లో మళ్లీ రైతుల పేర్ల మీద మార్చేలా కృషి చేస్తాం. ఫార్మాసిటీ రద్దు అంశంపై త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తాం.

– ముదిరెడ్డి కోదండరెడ్డి, మాజీ ఎమ్మెల్యే



వాహనదారులతో కిటకిటలాడుతున్న పెట్రోల్‌బంక్

'పెట్రో' టెన్షన్

కేంద్రం తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ కేసుకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ట్రక్కు డ్రైవర్లు ఆందోళన బాటపట్టారు. ప్రస్తుతం ఉన్న శిక్ష, జరిమానా భారీగా పెంచడంతో పాటుగా కేవలం లారీ డ్రైవర్లనే బాధితులుగా చేస్తూ చట్ట సవరణ చేశారని నిరసన చేపట్టారు. పెట్రోల్, డీజిల్ సరఫరా చేసే ట్రక్కులు నిలిచిపోయాయి. ఇంధన కొరత ఏర్పడుతుందనే ఆందోళనతో వాహనదారులు పెట్రోల్ బంక్‌లకు పోటెత్తారు. దీంతో భారీగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

- హిట్ అండ్ రన్ కేసు సవరణతో ట్యాంకర్ల డ్రైవర్లు, యజమానుల ఆందోళన
- బంకులకు పోటెత్తిన జనం
- ఒత్తిడి తట్టుకోలేక నో స్టాక్ బోర్డులు

ఇబ్రహీంపట్నం: పెట్రోల్ ట్యాంకర్ల డ్రైవర్లు, యాజమానుల సమ్మె చేస్తున్నారనే వార్త దావానంలా వ్యాపించడంతో మంగళవారం బంకుల ఎదుట వాహనదారులు బారులు తీరారు. ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల, యాచారం, మంచాల మండలాల పరిధిలోని పెట్రోల్ బంకులు వాహనదారులతో కిటకిటలాడాయి. పలు బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. కొన్ని చోట్ల పెట్రోల్ ఉన్నా సిబ్బంది పోయలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. వాహనాదారులతోపాటు, ప్లాస్టిక్ బాటిల్స్, క్యాన్‌లను పట్టుకోని పెట్రోల్ బంకుల వద్దకు వచ్చి సిబ్బందితో గొడవకు దిగారు. దీంతో బంకు సిబ్బంది పెట్రోల్ పోయకుండా నిలిపివేశారు. ఆఫీసులకు వెళ్లిన వారు, ఇతర పనులపై బయటకు వచ్చిన వారు తిరిగి వెళ్లేందుకు పెట్రోల్ బంకులకు రాగా.. సమ్మె నాలుగైదు రోజులు కొనసాగుతుందనే ప్రచారంతో బంకుల వద్ద భారీగా వాహనాలు చేరి ఇబ్బందికర వాతావరణం ఏర్పడింది.

పెట్రోల్ ఉన్నా



పెట్రోల్ బంకులో ఉన్నా పోయడం లేదు. నాలుగైదు రోజులు ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మె చేస్తున్నారంటూ ప్రచారం జరుగుతోంది. పెట్రోల్ లేకుంటే తమ దైవందిన పనులు నిలిచిపోతాయి. అందుకే పెట్రోల్ కోసం వచ్చాం.

– ఎండీ. ఆసీఫ్, ఇబ్రహీంపట్నం

సమస్యను పరిష్కరించాలి



ప్రజలకు పెట్రోల్ నిత్యావసరం. పెట్రో ట్యాంకర్ల యాజమానులు, డ్రైవర్లు సమ్మె చేస్తున్నారని.. దీంతో పెట్రోల్ లభ్యంకాదని తెలిసింది. ప్రభుత్వం ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలి. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి.

– శ్రీకాంత్, ఇబ్రహీంపట్నం

స్టాక్ ఉన్నా పోయలేకపోతున్నాం



బంకులో స్టాక్ ఉంది. జనాలు వాహనాలతో పాటుగా క్యాన్స్, బాటిల్స్‌తో వచ్చి గొడవ పడుతున్నారు. దీంతో సమస్య జటిలంగా మారింది. రద్దీ క్రమబద్ధీకరిస్తే తాము పెట్రోల్ పోయడానికి సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే పోలీసుల సహకారం కోరాం.

– ధశరథ, క్యాషియర్, ఇబ్రహీంపట్నం

అందని వైద్యం.. ప్రజల దైన్యం

ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ అయినా ఆశించిన మార్పులు రాలేదు. సమయ పాలన పాటించని వైద్యులు.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం.. వెరసి పేదలు మెరుగైన వైద్య సేవలు అందక ఇబ్బంది పడుతున్నారు.

- ఉదయం 11గంటలు దాటినా విధులకు హాజరవ్వని వైద్యులు
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న డాక్టర్లు
- ఇబ్బంది పడుతున్న రోగులు
- శిలాఫలకానికే పరిమితమైన ఆస్పత్రి నిర్మాణం



మంగళవారం ఉదయం 11 గంటలకు ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యుల కుర్చీ

యాచారం: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు సమయ పాలన పాటించడం లేదు. నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కనున్న ఈ ఆస్పత్రికి మండల వాసులతో పాటుగా మంచాల, మాడ్గుల, కందుకూరు, ఇబ్రహీంపట్నం, నల్గొండ జిల్లా పరిధిలోని చింతుల్ల, మర్రిగూడ తదితర మండలాల నుంచి పేదలు వస్తుంటారు. ఇక్కడ నిత్యం 250పైగా రోగులు జ్వరం, వాంతులు, విరేచనాలు, కాళ్లు, కీళ్ల నొప్పులు, బీపీ, షుగర్, తదితర వ్యాధులతో బాధపడే చికిత్స పొందుతుంటారు. కానీ ఇక్కడ పనిచేసే కొంతమంది వైద్యులు ఉదయం 11గంటలు దాటినా విధులకు హాజరవ్వడం లేదు. దీంతో మెరుగైన వైద్యంతో పాటు నాణ్యమైన మందులు అందవచ్చునని కలలుగన్న పేదలకు నిరాశే మిగులుతోంది. ఇదే విషయమై ప్రజలు పలు మార్లు, అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించడం లేదు. ఆలస్యంగా వచ్చిన వైద్యులు తిరిగి మధ్యాహ్నం 2గంటలకే ఆస్పత్రి నుంచి వెళ్లిపోతున్నారంటూ రోగులు వాపోతున్నారు.

బోర్డు మారింది.. సేవలు మారలే

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బోర్డు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంగా బోర్డు మారింది తప్పా ఎటువంటి మార్పులు జరగలేదని పలువురు వాపోతున్నారు. గతంలోనే వైద్యులు సేవలందించినా.. రాష్ట్ర వైద్య, విధాన పరిషత్ కింద ఉన్న ఈ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పర్యవేక్షణ కొరవడడంతో రోగుల నాడి పట్టి చూసేవారే కరువయ్యారని ఆరోపిస్తున్నారు. ఈ ఆస్పత్రిలో ఐదుగురు వైద్యులు ఉన్నప్పటికి నిత్యం నలుగురు డాక్టర్లు విధులకు హాజరవ్వరు. ఇక్కడకు వచ్చిన పేదలకు చీటి రాసి బయట పరీక్షలు చేయించుకుని రమ్మనడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం మందులు పంపించినా.. వాటిని దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒక్కో సారి వైద్యులు అందుబాటులో లేక పోవడంతో స్టాఫ్ నర్సులే ఇంజక్షన్లు, మందులు రాసి ఇచ్చి పంపిస్తున్నారని రోగులు వాపోతున్నారు. మరికొందరు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి జేబులు గుల్ల చేసుకుంటున్నారు.

శిలాఫలకానికే పరిమితమైన నూతన భవనం

60 ఏళ్ల క్రితం నిర్మించిన ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరింది. భవనం పైకప్పులు పెచ్చులూడి పడుతూ ప్రమాదకరంగా మారింది. సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ అయ్యాక శాశ్వత భవనం నిర్మించాలనే ఉద్దేశంతో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ నుంచి రూ.కోటిన్నర నిధులు ఖర్చు చేసేందుకు నిర్ణయించారు. 2023 ఆగస్టు 17న అప్పటి మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. నేటికీ పనులు ప్రారంభించిన దాఖలాలే లేవు. వైద్య విధాన పరిషత్, పంచాయతీ రాజ్ ఉన్నతాధికారులను అడిగితే నిధులు లేవంటూ సమాధానం వస్తుందని చర్చించుకుంటున్నారు.

నిరీక్షణ తప్పడం లేదు



ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే గంటల కొద్ది నిరీక్షణ తప్పడం లేదు. కాళ్లు, కీళ్ల నొప్పులు, జ్వరంతో వస్తే వైద్యులే ఉండడం లేదు. ఉన్న ఒకే వైద్యురాలును కలువడానికి గంటల కొద్ది వేచి చూడాల్సి వస్తోంది. పనులు వదులుకుని ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే వైద్యులు కలిసే లోపు అస్వస్థతకు గురికాక తప్పడం లేదు. మెరుగైన సేవల కోసం వైద్యులు కృషి చేయాలి.

– రాములు యాదవ్, మొండిగౌరెల్లి

వెళ్లడమే మానేశారు



మా గ్రామం నుంచి యాచారం ప్రభుత్వాసుపత్రికి 20 కిలోమీటర్ల దూరం ఉంటుంది. రూ.250 చార్జీలు పెట్టుకుని ఆస్పత్రికి వస్తే వైద్యులు ఉండడం లేదు. సరైన వైద్యం అందక మా గ్రామస్తులు ప్రభుత్వాసుపత్రికి రావడమే మానేశారు. రూ.250కి అదనంగా మరో రూ.వెయ్యి అప్పు చేసి మాల్‌లోని ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

– కొర్ర అరవింద్‌నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, మంతన్‌గౌరెల్లి

ఫిర్యాదులు వస్తున్నాయి



సామాజిక ఆరోగ్య కేంద్రంలో పూర్తి స్థాయిలో వైద్యులు ఉండడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయినా ప్రజలకు ఉపయోగం లేకుండా పోతోంది. త్వరలో ఆస్పత్రి అధ్వాన పరిస్థితిపై రాష్ట్ర వైద్య, విధాన పరిషత్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా. ఆస్పత్రి నూతన భవన నిర్మాణంపై పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో మాట్లాడుతా.

– కొప్పు సుకన్య, ఎంపీపీ, యాచారం

నామినేటెడ్‌పై కాంగ్రెస్ నేతల ఆశలు..!



ప్రయత్నాలు ముమ్మరం చేసిన ఆశావహులు

మొయినాబాద్: నామినేటెడ్ పదవులపై కాంగ్రెస్ నేతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల ఆరు తర్వాత నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టి సారిస్తామని వెల్లడించడంతో ఆశావహుల్లో హడావుడి మొదలైంది. పదేళ్లుగా పార్టీ అధికారంలో లేనప్పటికీ ఎంతో మంది పార్టీ పటిష్టతకు కృషి చేశారు. కాగా ఇంత కాలం పని చేసిన తమకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని పార్టీ పెద్దలను, మంత్రులను, ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. చేవెళ్ల నియోజకవర్గంలోని కొందరు నేతలు కార్పొరేషన్ల డైరెక్టర్ పదవులు, కొంత మంది జిల్లా స్థాయి నామినేటెడ్ పోస్టులు, మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల పదవులపై ఆశలు పెట్టుకున్నారు. సంక్రాంతి లోపు ఒక విడత నామినేటెడ్ పదవులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు స్వయంగా ముఖ్యమంత్రి చెప్పడంతో కొందరు నేతలు ఇప్పటికే లాబీయింగ్ మొదలుపెట్టారు. నామినేటెడ్ పదవులు ఎవరికి కట్టబెడతారో.. నియోజకవర్గ నాయకులకు ఏ పదవులు దక్కుతాయో వేచిచూడాలి.

శాఖలు మారినా.. వెతలు తీరలే!

- వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం
- అర్హత ఆధారంగా సర్దుబాటు
- తొమ్మిది నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు
- 882 మంది వీఆర్‌ఏల ఎదురు చూపులు



షాబాద్‌లో సమ్మె చేస్తున్న వీఆర్‌ఏలు (ఫైల్)

షాబాద్: గ్రామ రెవెన్యూ వ్యవస్థ (వీఆర్‌ఏలు) రెవెన్యూ విభాగానికి పట్టుగొమ్మలాంటిది. ఆ వ్యవస్థను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రద్దు చేస్తూ ఆశాఖలో పనిచేస్తున్న వీఆర్‌ఏలను ప్రభుత్వంలోని ఇతర శాఖలలో సర్దుబాటు చేశారు. గతేడాది తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పేస్కేల్ చేయాలనే ప్రధాన డిమాండ్‌తో మూడు నెలల పాటు విధులను బహిష్కరించి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపట్టారు. సమ్మెకు స్పందించిన అప్పటి ప్రభుత్వం 2023 ఆగస్టులో వారి డిమాండ్‌ను ఒప్పుకోవడంతో పాటు వీఆర్‌ఏల వ్యవస్థను రద్దు చేసి వారిని వివిధ శాఖల్లో పోస్టింగ్ ఇచ్చారు. పూర్వపు వీఆర్‌ఏలకు జీతాలు అందక తొమ్మిది నెలలుగా ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్‌ల వ్యవస్థను రద్దుచేసి వారి అర్హతను బట్టి వివిధ శాఖల్లో పోస్టింగ్‌లు ఇచ్చింది. కొంత మందిని ఇతర జిల్లాలకు సైతం బదిలీ చేయగా మరికొంత మందికి వారి సొంత జిల్లాల్లోనే కొలువులిచ్చింది. కానీ వేతనాలు మాత్రం ఇవ్వడం లేదు. దీంతో తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పెండింగ్ వేతనాలను నూతన ప్రభుత్వమైనా ఇచ్చి తమ వెతలు తీర్చాలని గత వీఆర్‌ఏలు కోరుతున్నారు. దీనిపై ఇటీవల జిల్లాకు చెందిన పలువురు యూనియన్ నాయకులు డీఆర్‌ఓకు తమ సమస్యలను వివరించి, వినతిప్రతం అందజేశారు.

కొత్త విధులకు వీఆర్‌ఏలు

జిల్లా వ్యాప్తంగా 882 మంది ఉండగా వారి అర్హత ఆధారంగా వివిధ శాఖల్లో పోస్టింగ్ ఇవ్వడంతో పాటు జిల్లాకు చెందిన పలువురు రికార్డు అసిస్టెంట్లతో పాటు అటెండర్లను వివిధ జిల్లాలకు బదిలీ చేశారు. అటెండర్లుగా పనిచేసిన వారు ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో కెనాల్స్‌లో ఎక్కువగా విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన వారు పలుశాఖల్లో అటెండర్లుగా పని చేస్తున్నారు. అందులో జూనియర్ అసిస్టెంట్లకు రూ.24 వేలు, రికార్డు అసిస్టెంట్లకు రూ.22వేలు, అటెండర్లకు రూ.19,500 చొప్పున వేతనాలు సర్దుబాటు చేసి జాయినింగ్ రిపోర్టు ఇవ్వడంతో వారంతా విధుల్లో చేరారు.

కొత్త ప్రభుత్వమైనా స్పందించాలి

తాత ముత్తాతల నుంచి గ్రామాల్లో తక్కువ వేతనాలకు వీఆర్‌ఏలుగా పనులు చేశామని.. మమ్ములను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పేస్కేల్ ఇవ్వాలని, 55 ఏళ్లు నిండిన వారి వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలంటూ గత ప్రభుత్వ హయాంలో మూడు నెలలు పాటు సమ్మె చేశారు. కాగా వారికి సమ్మె కాలానికి కూడా వేతనాలు ఇస్తామని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. సమ్మె అనంతరం ఐదు మాసాలుగా విధులు నిర్వహించినా వేతనాలతో కలిపి మొత్తం తొమ్మిది నెలలుగా జీతాలు లేక పోవడంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని ఆందోళన చెందుతున్నారు. తమకు రావాల్సిన వేతనాలు ఇచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

వేతనాలు విడుదల చేయండి



షాబాద్ రెవెన్యూ విభాగంలోనే సర్దుబాటులో భాగంగా జూనియర్ అసిస్టెంట్‌గా విధులుగా విధులు నిర్వహిస్తున్నా. వీఆర్‌ఏల సమస్యల పరిష్కరించాలంటూ మూడు నెలలు సమ్మె చేశాం,అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించింది. సమ్మె కాలపు వేతనాలతో పాటు ఆరు మాసాల నుంచి విధులు నిర్వహిస్తున్నా నేటికీ జీతాలు అందలేదు. తమకు పెండింగ్ వేతలు ఇచ్చి ఆదుకోవాలి.

– రాములు, జూనియర్ అసిస్టెంట్, షాబాద్

అప్పులు చేసి నెట్టుకొస్తున్నా...



వీఆర్‌ఏలుగా పనిచేస్తున్న మమ్మల్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం వివిధ శాఖలలో రెగ్యులర్ ఉద్యోగులుగా సర్దుబాటు చేసింది. కానీ జీతాలు రావడం లేదు. మాకు కేటాయించిన విభాగం దూరమైనా తప్పక అక్కడికి వెళ్లి విధులు నిర్వర్తిస్తున్నా. అప్పు చేసి ఉద్యోగం చేయాల్సిన పరిస్థితి. కొత్త ప్రభుత్వం మా సమస్యలను పరిష్కరించి వేతనాలు అందేలా చూడాలి.

– పెంటయ్య, వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు, షాబాద్

చింతల్‌చెరువుపై వంతెన నిర్మించండి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి మత్స్యకార్మిక సంఘం నేతల వినతి
- ఎన్‌హెచ్‌–65 అధికారులకు మంత్రి ఆదేశాలు


ఏఈ శరత్‌చంద్రకు లేఖను అందజేస్తున్న నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్‌: చింతల్‌చెరువు కాల్వపై శాశ్వత వంతెన నిర్మించేలా ఎన్‌హెచ్‌– 65 అధికారులను ఆదేశించాలని అబ్దుల్లాపూర్‌మెట్‌ మత్స్య కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక బీజేపీ నేతలతో కలిసి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గతంలో జరిగిన రోడ్డు విస్తరణలో అప్పటి కాంట్రాక్టర్‌ తాత్కాలికంగా పైప్‌లైన్‌ వేసి చేతులు దులుపుకొన్నాడని, దీంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోందని మంత్రికి వివరించారు. చింతల్‌చెరువుపై నాలుగు గ్రామాల ప్రజలు ఆధారపడి ఉన్న నేపథ్యంలో శాశ్వత వంతెన నిర్మించి, వరద నీరు చెరువులోకి వెళ్లేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన కిషన్‌రెడ్డి వెంటనే కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్‌ గడ్కరీకి లేఖ రాశారు. ఈ లేఖ ప్రతిని ఎన్‌హెచ్‌– 65 ఏఈ శరత్‌చంద్రకు అందజేశారు. కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం నాయకులు మాచగోని రమేశ్‌ముదిరాజ్‌, ఎలమోని రామకృష్ణ, బీజేపీ నాయకులు బొడిగె గోవర్ధన్‌గౌడ్‌, వడ్డేపల్లి పాపయ్యగౌడ్‌, శ్రీనివాస్‌, ఆనంద్‌, యాదగిరి, మల్లేశ్‌, మచ్చేందర్‌, శ్రీశైలం, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒగ్గు కళాకారుడి మృతి

- మౌత్‌ పీస్‌కు షార్ట్‌ సర్క్యూట్‌ కావడంతో ప్రమాదం
- చందనవెల్లిలో ఘటన


శివకుమార్‌ (ఫైల్‌)

షాబాద్‌: విద్యుత్‌ షాక్‌తో ఒగ్గు కళాకారుడు మృతి చెందిన సంఘటన షాబాద్‌ మండల పరిధిలోని చందనవెల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్‌ మండలం పెద్దమంగళానికి చెందిన శివకుమార్‌(50) చందనవెల్లికి చెందిన కందివనం మల్లేశ్‌గౌడ్‌ ఇంటి వద్ద ఎల్లమ్మ కల్యాణం నిర్వహించాడు. ఈ సందర్భంగా ఒగ్గు కథ చెప్పేందుకు మౌత్‌పీస్‌(మైకు) ఏర్పాటు చేయించాడు. దీనికి షార్ట్‌ సర్క్యూట్‌ కావడంతో శివకుమార్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు షాబాద్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మొయినాబాద్‌ ఇన్‌స్పెక్టర్‌గా పవన్‌కుమార్‌రెడ్డి

మొయినాబాద్‌: మొయినాబాద్‌ ఇన్‌స్పెక్టర్‌గా గుడి పవన్‌కుమార్‌రెడ్డి రానున్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి సైబరాబాద్‌ కమిషనర్‌ అవినాశ్‌ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు మొయినాబాద్‌ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఏవీ రంగాపై అవినీతి ఆరోపణలు రావడంతో ఆయన్ని మల్టీజోన్‌–2కు సరెండర్‌ చేశారు. ఆ స్థానంలో మియాపూర్‌ డివిజన్‌ సైబర్‌ క్రైం ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న పవన్‌కుమార్‌రెడ్డిని ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు.

ఆదమరిస్తే అంతే.!

చలికి చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఎముకలు కొరికే శీతల పవనాలు వీస్తున్న సమయంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా ప్రయాణ వేళల్లో సైతం అప్రమత్తత ముఖ్యం.

పొగమంచుతో వాహనదారుల తిప్పలు
- జిల్లాలో శీతల గాలులు
- చలితో అనారోగ్య సమస్యలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు


కురుస్తున్న పొగమంచు

షాబాద్‌: పొగ మంచు జిల్లాపై చలి పంజా విసురుతోంది. ఓ వైపు చలి, మరో వైపు పొగమంచు కారణంగా ప్రజలు వణికిపోతున్నారు. చల్లని గాలులకు జనాలు శ్వాస సంబంధ సమస్యలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పొగమంచు కారణంగా వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బంది పడుతున్నారు. ఈ సమయాల్లో వాహనాలను జాగ్రత్తగా నడపాల్సిన అవసరం ఉంది. అంతే కాకుండా చలికి చిన్నపిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు.

ఆరోగ్యం పదిలం
- వెచ్చని దుస్తులు ధరించడంతో పాటు వేడి పానీయాలు తీసుకోవాలి.
- శారీరక శ్రమ శరీరాన్ని బలోపేతం చేస్తుంది.
- రోజుకు 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.
- సమతుల్యమైన ఆహారం కోసం పండ్లు, కూరగాయలు, పప్పు దినుసులు తీసుకోవాలి.
- వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

ప్రయాణం.. ప్రమాదకరం
- పొగమంచులో ప్రయాణం చేసేటప్పుడు వాహనాన్ని తక్కువ వేగంతో నడపాలి.
- తక్కువ భీమ్‌లో హెడ్‌లైట్లను సెట్‌ చేసుకోవాలి.
- కారు ఫాగింగ్‌ ల్యాంప్‌ ఆన్‌ చేయడం మంచిది.
- వాహనం ప్రయాణిస్తున్న లేన్‌ను మార్చకూడదు.
- వాహనాలు కనిపించకపోతే ఇండికేటర్‌ ఉపయోగించాలి.
- అద్దాలను లోపల, బయట క్లీన్‌గా ఉంచుకోవాలి.
- వాహనాన్ని ఎవర్‌టేక్‌ చేసేందుకు ప్రయత్నించవద్దు.
- వాహనానికి, వాహనానికి మధ్య దూరం పాటించాలి.

జాగ్రత్తలు అవసరం



చలి, మంచు సమయాల్లో చిన్నపిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్త తీసుకోవాలి. దగ్గు, జలుబు లాంటివి ఉంటే సమీపంలోని పీహెచ్‌సీకి వెళ్లి చికిత్స చేయించుకోవాలి. అన్ని ఆస్పత్రుల్లో అన్ని రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. కోవిడ్‌ భయాలు ఏమాత్రం వద్దు. మమ్స్‌ అనే సమస్య మన జిల్లాలో ప్రస్తుతం లేవు.
– డాక్టర్‌ దామోదర్‌, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

వేగం తగ్గించాలి



పొగ మంచు కురిసే సమయాల్లో వేగాన్ని తగ్గించి వాహనాలు నడపాలి. హెడ్‌లైట్లు, ఎల్లో ఇండికేటర్స్‌ వేసుకోవాలి. వాహనాలకు రేడియం స్టిక్కర్లు తప్పకుండా ఉండాలి. డ్రైవర్లు వాహనాల మధ్య దూరం పాటించాలి. ఆగి ఉన్న వాహనాలను గుర్తిస్తూ నడపాలి.
– యాదయ్యగౌడ్‌, సీఐ షాబాద్‌

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

బైక్‌ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఘటన


మృతిచెందిన సుందరం

ఇబ్రహీంపట్నం: వేగంగా వస్తున్న బైక్‌ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్నెగూడకు చెందిన షణ్ముక సుందరం(25), డి. విక్కి(21) బైక్‌పై నగరం నుంచి బొంగుళూర్‌ వైపు వస్తున్నారు. ఓఆర్‌ఆర్‌ బొంగుళూర్‌ రింగ్‌ వద్ద బైక్‌ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌ వెనుక కూర్చున్న సుందరం తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడగా, విక్కికి స్వల్ప గాయాలు అయినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌జీఐఏ ఇన్‌స్పెక్టర్‌గా బాలరాజు

శంషాబాద్‌: శంషాబాద్‌ ఆర్‌జీఐఏ ఇన్‌స్పెక్టర్‌గా కొక్కొండ బాలరాజు నియమితులయ్యారు. ఈ మేరకు సైబరాబాద్‌ పోలీస్‌ కమిషనర్‌ అవినాష్‌ మహంతి మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. రాజేంద్రనగర్‌ జోన్‌ సీసీఎస్‌ సీఐగా ఉన్న బాలరాజును బదిలీ చేశారు. ఇటీవలే ఆర్‌జీఐఏ సీఐ రాపోలు శ్రీనివాస్‌ ఓ కేసు విషయంలో సస్పెండ్‌ కావడంతో ఆయన స్థానంలో ఆర్‌జీఐఏ పీఎస్‌లో డీఐగా ఉన్న రాజు గత వారం రోజులుగా ఇన్‌చార్జి సీఐగా వ్యవహరిస్తున్నారు.

డాక్టర్‌ భారతేందుకు లైఫ్‌టైమ్‌ అచీవ్‌మెంట్‌ అవార్డు

లక్డీకాపూల్‌: ప్రముఖ వైద్యనిపుణులు, ఆకార్‌ ఆశ హాస్పిటల్‌ నిర్వాహకులు డాక్టర్‌ భారతేందు సైన్స్‌కు భూగర్భ శాస్త్రవేత్త రావు పంగనామముల లైఫ్‌టైమ్‌ అచీవ్‌మెంట్‌ అవార్డు దక్కింది. ఈమేరకు మంగళవారం లక్డీకాపూల్‌లోని ఓ హోటల్‌లో నేషనల్‌ రిసోర్స్‌ డెవలప్‌మెంట్‌ కోఆపరేటివ్‌ సొసైటీ (ఎన్‌ఆర్‌డీసీఎస్‌) స్వర్ణోత్సవ వేడుకలు, భూమి, ఆరోగ్యం అంశాలలో రావు లైఫ్‌టైమ్‌ అచీవ్‌మెంట్‌ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం, కేంద్ర జియాలజికల్‌ సర్వే విభాగం మాజీ డిప్యూటీ డైరెక్టర్‌ జనరల్‌ ఈవీఆర్‌ పార్థసారధి, దూరదర్శన్‌ మాజీ క్రియేటివ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఓలేటి పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్లూ ఇన్‌చార్జి వీసీగా ప్రొ.సురభి భారతి



ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్‌ అండ్‌ ఫారిన్‌ లాంగ్వేజస్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ (ఇఫ్లూ) ఇన్‌చార్జి వీసీగా ప్రొ.సురభి భారతి నియమితులయ్యారు. ఇంత కాలం వీసీగా కొనసాగిన ప్రొ.సురేష్‌కుమార్‌ పదవీ కాలం ముగియడంతో లింగ్విస్టిక్స్‌ విభాగం అధ్యాపకురాలు ప్రొ.సురభి భారతికి పాలన బాధ్యతలు అప్పగించారు. ఇఫ్లూ ఉద్యోగులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ వీసీ ప్రొ.సు రేష్‌ కుమార్‌ను సన్మానించి వీడ్కోలు పలికారు.

తెలంగాణ శాసన సభాపతికి సన్మానం

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ కాంగ్రెస్‌ పార్టీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌ కుమార్‌కు పూలబోకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ హరికృష్ణా, శేఖర్‌, రాజు, నగేష్‌ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వార్లకు వెండి ఆభరణాలు

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ బుద్వేల్‌లోని శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయానికి శ్రీనివాస సేవా సమితి ఆధ్వర్యంలో వెండి ఆభరణాలను మంగళవారం అందజేశారు. హనుమంతుడితో పాటు శివలింగానికి అలంకరించేందుకు రూ.2.40 లక్షల వ్యయంతో తయారు చేసిన వెండి వస్తువులను అందించారు. పూజ అనంతరం కమిటీ సభ్యులు శివుడు, ఆంజనేయస్వామికి ఆభరణాలను అలంకరించారు.

ముందస్తుతో లాభాలు బాగు

- బీన్స్‌ సాగులో సస్యరక్షణ ముఖ్యం
- కృషి విజ్ఞాన్‌ కేంద్రం, క్రిడా నిపుణుడు శ్రీకృష్ణ
- రైతులకు పలు సూచనలు


శ్రీకృష్ణ


సాగులో ఉన్న బీన్స్‌ పంట

కందుకూరు: ఫ్రెంచి చిక్కుడు(బీన్స్‌) సాగుతో రైతులు మంచి లాభాలు గడిస్తున్నారు. పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెళకువల గురించి కృషి విజ్ఞాన్‌ కేంద్రం రంగారెడ్డి జిల్లా క్రిడా నిపుణుడు శ్రీకృష్ణ రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు.

- చల్లని వాతావరణ ఉన్న ప్రాంతాల్లో బీన్స్‌ పంట సంవత్సరం పొడవునా సాగు చేయవచ్చు. అధిక మంచు, ఉష్ణోగ్రతను ఈ పంట తట్టుకోలేదు. మన రాష్ట్రంలో శీతాకాలంలోనే పండిస్తారు.
- ఇసుకతో కూడిన గరప నేలల నుంచి బరువైన నేలల వరకు ఈ పంటను అన్ని రకాల నేలల్లో పండిచవచ్చు.
- అక్టోబర్‌ నుంచి జనవరి నెల వరకు విత్త వచ్చు. కొండ ప్రాంతంలో మార్చి నుంచి మే నెల వరకు విత్తుకోవచ్చు.
- నేల అదునుగా వచ్చే వరకు దున్నాలి. వరుసల్లో మొక్కకు, మొక్కకు మధ్య 25–30 సెం.మీ ఎడం ఉండేట్లుగా విత్తనాలను నాటాలి. వరుసల మధ్య దూరం 30–46 సెం.మీ ఉండాలి. విత్తే సమయంలో సరిపోయే తేమ ఉండటం ఎంతైనా అవసరం. హెక్టారుకు 25 నుంచి 30 కిలోల విత్తనం అవసరం అవుతుంది.
- ఆఖరు దుక్కిలో 20–25 టన్నుల పశువుల ఎరువు వేసి బాగా కలియదున్నాలి. తదుపరి హెక్టారుకు 20 కిలోల నత్రజని, 50 కిలోల భాస్వరం, 50 కిలోల పొటాష్‌ను విత్తడానికి ఒక వారం ముందు వేసి దున్నాలి.
- పొలంలో కలుపు మొక్కలు లేకుండా ఒకటి రెండు సార్లు అంతర కృషి చేయాలి.
- మొక్కల వేరు పైపైనే ఉండటంతో నేలలో అధిక తేమను తట్టుకోలేవు. తర్వాత అవసరాన్ని బట్టి ప్రతి 7–10 రోజులకొకసారి నీరు పెట్టాలి.

అందుబాటులో ఉన్న వివిధ రకాలు

- **కంటెండర్‌ రకం..**
మొక్కలు గుబురుగా ఉండి 50–55 రోజుల్లో మొదటి కోతను ఇస్తాయి. కాయలన్నీ గుత్తులతో గుండ్రంగా, ముదురు ఆకుపచ్చ రంగులో నార లేకుండా ఉండి చివర భాగం మెలిక తిరిగి ఉంటుంది. పక్వదశలో కొన్ని కాయలు ఊదా రంగులో గాని లేక ఊదా రంగు నారను కలిగి ఉంటాయి. గింజలు లేత గోధుమ వర్ణంలో ఉంటాయి. వెర్రి తెగులు, బూడిద తెగులును కొంత వరకు తట్టుకుంటాయి.
- **బౌంటిఫుల్‌ రకం..**
అధిక దిగుబడినిచ్చు రకం, కాయ కండను కలిగి ఉండి తక్కువ నారను కలిగి ఉంటాయి. కాయలు ఆకుపచ్చ రంగులో ఉండి తొందరగా కోతకు వస్తాయి.
- **అర్కకోమల్‌..**
ఐఐహెచ్‌ఆర్‌ బెంగళూరు వారు విడుదల చేసిన స్వల్పకాల పరిమితి రకం ఇది. వీటి కాయలు పొడవుగా మంచి కండతో నార లేకుండా ఉంటాయి. హెక్టారుకు 18–20 టన్నుల దిగుబడినిస్తుంది.
- **పూసా పార్వతి..**
ఇది స్వల్పకాల పరిమితి గల మ్యూటెంట్‌ రకం. కాయలు ముదురు ఆకుపచ్చ రంగులో లేత పసుపు రంగు విత్తనాలతో ఉంటాయి. వెర్రి తెగులు, బూడిద తెగులును తట్టుకుంటాయి.
- **ప్రీమియర్‌..**
ఇది స్వల్పకాల పరిమితి గల రకం. 45–50 రోజుల్లో కోతకు వస్తుంది. మొక్కలు గుబురుగా, కాయలు లేత ఆకుపచ్చ రంగులో ఉంటాయి. విత్తనాలు ముదురు గోధుమ వర్ణంలో ఉంటాయి. ఆలస్యంగా విత్తుటకు అనువైనది. ఎండు తెగులు, వెర్రి తెగులును కొంత వరకు తట్టుకుంటుంది.

సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ పట్టాలపై వెళ్తుండగా..

- వెనక నుంచి ఢీకొట్టిన రైలు
- తీవ్రగాయాలపాలై చికిత్స పొందుతూ బాలుడు మృతి


సిద్ధీఖ్‌ (ఫైల్‌)

షాద్‌నగర్‌ రూరల్‌: సెల్‌ఫోన్‌ మాట్లాడుతూ పట్టాలపై వెళ్తున్న బాలుడు రైలు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం షాద్‌నగర్‌లో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాలిలా ఉన్నాయి.. మున్సిపల్‌ పరిధిలోని సిమ్లానగర్‌ కాలనీకి చెందిన అబుబాకర్‌ సిద్ధీఖ్‌(17) సోమవారం సాయంత్రం కీర్తి వెంచర్‌ సమీపంలో సెల్‌ఫోన్‌ మాట్లాడుతూ రైలు పట్టాలపై నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. ఈ సమయంలో వెనక నుంచి వస్తున్న రైలును గమనించకపోవడంతో ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సిద్ధీఖ్‌ను చికిత్స నిమిత్తం స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రుడిని శంషాబాద్‌లోని లిమ్స్‌ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించాడు. మృతుడి తండ్రి అక్బర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే హెడ్‌ కానిస్టేబుల్‌ శ్రీనివాస్‌ తెలిపారు.

అబాకస్‌ పోటీలో సత్తా చాటిన విద్యార్థులు



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

రాజేంద్రనగర్‌: జాతీయ స్థాయి అబాకస్‌ పోటీల్లో పాల్గొని సత్తా చాటిన విద్యార్థులను రాజేంద్రనగర్‌లో తోటి అబాకస్‌ విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. 13వ జాతీయ అబాకస్‌ పోటీలు మహారాష్ట్ర పుణేలో నిర్వహించారు. ఈ పోటీల్లో దేశ నలుమూలల నుంచి 3,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రాజేంద్రనగర్‌తో పాటు కిస్మత్‌పూర్‌లోని స్మార్ట్‌ కిడ్‌ లర్నింగ్‌ అకాడమీ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో రితిక్‌, నిత్యశ్రీ, జోశ్రీతలకు మొదటి స్థానం. ప్రణయ్‌, యశ్వంత్‌లకు ద్వితీయ, నిహాల్‌ తృతీయ బహుమతులు అందాయి. వీరిని అకాడమీ డైరెక్టర్‌ గోపి మల్లేశ్వరి ఘనంగా సన్మానించారు. మొత్తం 6 మంది విజేతలుగా నిలిచారని తెలిపారు. గతంలో రాష్ట్ర స్థాయిలో జరిగిన అనేక పోటీల్లో తమ అకాడమీ విద్యార్థులు పాల్గొని సత్తా చాటారని గుర్తు చేశారు. విజేతలను ఈ సందర్భంగా అకాడమీ నిర్వాహకులతో పాటు తోటి విద్యార్థులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

శౌర్య సేవా పతకానికి రమేశ్‌ ఎంపిక


పండ్ల రమేశ్‌, అగ్నిమాపక అధికారి

మహేశ్వరం: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన మహేశ్వరం అగ్నిమాపక అధికారి పండ్ల రమేశ్‌ రాష్ట్ర శౌర్య సేవా పతకానికి ఎంపికయ్యారు. మహేశ్వరం, మంఖాల్‌ పారిశ్రామిక వాడలలో అగ్ని ప్రమాద నివారణ చర్యలు చేపట్టినందుకు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నందుకు ఆయన ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. వివిధ ప్రమాదాల్లో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా మహేశ్వరం అగ్నిమాపక అధికారిగా తగు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రకటించిన ఏడు శౌర్య సేవా పతకాలలో మహేశ్వరం అగ్నిమాపక అధికారిగా తనకు అవార్డు రావడం గర్వంగా ఉందన్నారు. తాను ప్రదర్శించిన సేవకు శౌర్య అవార్డు వచ్చిందన్నారు. ముున్ముందు మరింత బాధ్యతయుతంగా పని చేసి ఉత్తమ సేవలు అందిస్తానని ఆయన తెలిపారు. అవార్డు పట్ల అగ్నిమాపక అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలిపారు.

కౌన్సిలర్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

శంషాబాద్‌: పట్టణంలోని 4వ వార్డు కౌన్సిలర్‌ జహంగీర్‌ఖాన్‌ తన పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.